ఎప్పుడు పూర్తి చేస్తారో..?

- వివరాలు 8 లో ▸

నేడు మున్సిపల్ కమిషనర్‌తో
సాక్షి ఫోన్ ఇన్

సమయం : శనివారం ఉదయం 11 గంటల నుంచి 11.45 వరకు
ఫోన్‌నంబరు : 98499 05877
అంశం : జగిత్యాలలో పారిశుధ్య పరిస్థితి, దోమలు, ఇతర సమస్యలపై పరిష్కారాన్ని కోరవచ్చు.
- జగిత్యాల


అనిల్‌బాబు, జగిత్యాల మున్సిపల్ కమిషనర్

గరిష్టం/కనిష్టం
31.0/24.0
వాతావరణం
జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉండి.. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా చేపట్టాలి


లత

జగిత్యాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతు బంధు, రైతుబీమా, రుణమాఫీ, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలు పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లబ్ధిదారుల వివరాలను ఇప్పటి వరకు మంజూరైన నగదుకు సంబంధించిన వివరాలను నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మత్స్యశాఖ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు 2014 నుంచి ఇప్పటి వరకు ఏఏ బెనిఫిట్స్ ఇచ్చారో వివరాలు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామ పంచాయతీ భవనాలు, రోడ్ల మురికికాలువలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పూర్ణచందర్‌రావు, రెవెన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

నృసింహుడికి ప్రత్యేక పూజలు


పండితులను ఆహ్వానిస్తున్న దేవస్థానం సిబ్బంది

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి భాద్రపద మాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఈనెల 29 వరకు కొరిడె విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించబడే భాగవత సప్తాహ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. విశ్వనాథశాస్త్రిని ఈవో శ్రీనివాస్ సన్మానించి ఆలయానికి ఆహ్వానించారు. భాగవతా గ్రంథానికి పూజ చేసి సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రేనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను అభినందించిన మంత్రి


చైర్మన్‌ను అభినందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన బక్కి వెంకటయ్య సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను మంత్రి అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తనవంతు సహకారం అందిస్తానని వెంకటయ్య పేర్కొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిళాసంఘ సభ్యులు

జగిత్యాలరూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఎస్‌బీఎం కో–ఆర్డినేటర్ హరిణి అన్నారు. శుక్రవారం జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటోందని, మహిళ సంఘ సభ్యులు గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూలించేందుకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో తడిచెత్త, పొడిచెత్త సేకరణ, శ్రమదాన కార్యక్రమాల్లో మహిళ సంఘాల వారు కృషి చేయాలన్నారు. స్వచ్ఛహీ సేవ కార్యక్రమంపై సంతకాలు సేకరించారు. ఏపీఎం గంగాధర్, డీఎంజీ దేవయ్య, సీసీలు విద్యాసాగర్, గంగారాం, రవీందర్, సంతోష్, రాజేందర్ ఉన్నారు.

రూ.20 కోట్ల నిధులు మంజూరు

గొల్లపల్లి: జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించి ధర్మపురి నియోజకవర్గంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్డీఎఫ్) కింద మూడు పనులకు రూ.20 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ధర్మపురి మండలం రాయపట్నం జంక్షన్ కోదాడ రహదారి (కూడలి) అభివృద్ధి విస్తరణ కోసం రూ.3.50 కోట్లు, అలాగే ఎండపల్లి మండలం రాజారంపల్లి చౌరస్తాలోని జంక్షన్ విస్తరణలో భాగంగా అభివృద్ధి కోసం రూ.2 కోట్లు, ధర్మారం మండలం ఫోర్ లేన్ డివైడర్ డ్రైయినేజీ నిర్మాణానికి రూ.14.50 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయా మండలాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పొద్దంతా పందులు.. రాత్రంతా దోమలు



ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలతో ప్రజల ఇబ్బందులు

- నిలిచిన మురుగు నీరు.. పెరిగిన పిచ్చిమొక్కలు
- ముసురుకుంటున్న సీజనల్ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు
- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి

ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇళ్లమధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు నిలుస్తోంది. అందులో దోమలు ముసురుకుంటున్నాయి. పందులు తిరుగుతున్నాయి. పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. ఫలితంగా ఆయా కాలనీల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఇదే పరిస్థితి ఉండగా.. సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. వర్షాకాలం.. వ్యాధుల సమయంలో ఖాళీస్థలాలపై దృష్టిపెట్టాల్సి ఉండగా.. పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేశారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఖాళీస్థలాలతో ప్రజలు పడుతున్న కష్టాలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..!!

– జగిత్యాల/మెట్‌పల్లి/కోరుట్ల/రాయికల్/ధర్మపురి



- జగిత్యాల విద్యానగర్ కాలనీ ఇది. బిల్డింగ్‌లు కన్పించనంతగా పిచ్చిమొక్కలు పెరిగాయి. వర్షానికి నీరు నిలిచి దోమలు, పందులు, కుక్కలు విజృంభిస్తున్నాయి. రోగాలు ముసిరే అవకాశం ఉందని, అధికారులు పిచ్చిమొక్కలు తొలగించాలని కోరుతున్నారు.



- జగిత్యాలలోని రవీంద్రనాథ్‌ఠాగూర్ సమీపంలోని కాలనీ ఇది. ఇక్కడి ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో రాత్రి వేళల్లో విషపురుగులు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



- జగిత్యాల బైపాస్‌రోడ్‌లోని అపార్ట్‌మెంట్ల పరిధిలో ఉన్న ఖాళీస్థలం చిట్టడవిని తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. డ్రెయినేజీ కన్పించడం లేదు. మురికినీరు వెళ్లడం లేదు. పిచ్చిమొక్కలు వెంటనే తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



- జగిత్యాల గణేశ్‌నగర్ ఆలయం సమీపంలోని కాలనీ ఇది. ఖాళీస్థలంలో డ్రెయినేజీ నీరు చేరి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. ప్రజలు దోమలు, పందులతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. పిచ్చిమొక్కలు, మురికినీరు తొలగించాలని కోరుతున్నారు.

ధర్మపురిలో..


ధర్మపురి పట్టణంలో నిలిచిన నీరు

- ధర్మపురి పట్టణంలో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఇండ్ల పరిసరాల్లో అపరిశుభ్రతతో జ్వరాల బారిన పడుతున్నారు. నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణం అవుతున్నాయి. మున్సిపల్ అధికారులు దోమల నివారణకు ఆయిల్ బాల్స్, స్ప్రేలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. పట్టణంలోని 15 వార్డులుండగా ఏ వార్డులో చూసినా.. జ్వర పీడితులే ఉన్నారు.

నోటీసులిస్తున్నా..

- జగిత్యాలలో పారిశుద్యం అస్తవ్యస్తంగా మారింది. 48 వార్డుల్లో 1,20,357 మంది జనాభా నివసిస్తుండగా.. 296 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. విద్యానగర్, తులసీనగర్, బైపాస్‌రోడ్, గోవిందుపల్లితో పాటు శివారు కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి.
- వాటిని తొలగించాలని ప్లాట్ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగుల, పాములు చుట్టుపక్కల ఇళ్లకు చేరడంతో పాటు దోమలు, పందులు, ఈగలతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు.
- దీంతో డెంగీ, మలేరియా, టైపాయిడ్ బారిన పడుతున్నారు. నిబంధనల ప్రకారం బల్దియా అధికారులు వారి వాహనాలతో చదును చేపించి సదరు యజమాని ద్వారా బిల్లు చెల్లించుకోవచ్చు. కానీ ఇది ఎక్కడ జరగడం లేదు.
- ఖాళీస్థలాలు ఉన్న కాలనీల్లో సాయంత్రం కాగానే దోమలు విపరీతంగా వస్తున్నాయి.
- ఫాగింగ్ చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. దోమలతో పాటు విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలంటున్నారు.
- పట్టణంలోని చాలా ప్రాంతాల్లో డ్రెయినేజీల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో చిన్న పాటి వర్షానికే పొంగి పొర్లుతున్నాయి.
- పట్టణ ప్రగతిలో భాగంగా పిచ్చిమొక్కలు, డ్రెయినేజీలు శుభ్రం చేసినప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలిచి సమస్యగా మారింది.

బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం

జగిత్యాల పట్టణంలో పారిశుద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించని యజమానులకు నోటీసులు జారీ చేశాం. బోర్డులు సైతం ఏర్పాటు చేస్తున్నాం. ఒకవేళ వారు స్పందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

కోరుట్లలో..


కోరుట్లలో ఇళ్లమధ్య నిలిచిన వర్షం నీరు

- కోరుట్ల పట్టణ శివారులోని ఆనంద్‌నగర్, నక్కలగుట్ట, భీమునిదుబ్బ, ప్రకాశం రోడ్, ముత్యాలవాడ, బిలాల్‌పురా, బెండపల్లి, గంగంపేట ఏరియాల్లో వారం రోజులుగా ఓ మోస్తరుగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికీ నీరు నిలిచి ఉండటం గమనార్హం. ఖాళీ స్థలాల్లో నిలిచిన నీరుతో మలేరియా, డెంగీ దోమలు పెరిగి జనం జ్వరాల పాలవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతీ రోజు సుమారు 180 మంది వరకు ఔట్‌పేషంట్లు ఉండగా వందమంది వరకు జ్వరాలతో వస్తున్నారు. ఖాళీ ప్లాట్లు, స్థలాల్లో నిల్వ ఉన్న నీటి తొలగింపుపై శ్రద్ధ చూపి దోమల నియంత్రణకు చర్యలు చేపడితే వ్యాప్తిస్తున్న జ్వరాలకు కళ్లెం వేయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జ్వరాలు వస్తున్నాయి

- రాయికల్‌లో వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నాయి. పట్టణంలో 12 వార్డులు ఉండగా, ఓపెన్ ప్లాట్లలో నీరు నిలువ ఉండి పిచ్చిమొక్కలు పెరగడం తో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ఆయా కాలనీల్లో మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. 4వ వార్డులోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణ, దేశాయి ఆఫీస్, 2వ వార్డులోని శివాలయం, వీరాపూర్‌రోడ్, 1వ వార్డులో ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, షాదీఖానా, 6వ వార్డులో చెరువుకట్ట, సుద్దనూతి ఏరియా, 9వ వార్డులో నాగారం వాడా, కల్లు మండువ, 5వ వార్డులో భీమన్న ఏరియా, 3వ వార్డులో ఇందిరానగర్‌లోని ఖాళీస్థలాల్లో నీరు నిలిచి.. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. 'పట్టణంలో నిర్మాణాలు చేపట్టని ప్లాట్ల యజమానులకు నోటీసులు అందజేశాం. పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచాలని సూచించాం'. అని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ వివరించారు.


రాయికల్‌లోని బేతని హాస్పిటల్ ఏరియాలో ఉన్న ఖాళీ ప్రదేశంలో పెరిగిన పిచ్చిమొక్కలు

మెట్‌పల్లిలో..




- ఇది మెట్‌పల్లి పట్టణం 12వార్డులోని ఓ వీధిలో ఇండ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలం. డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో ఇండ్లల్లో నుంచి వచ్చే మురుగు నీరు ఖాళీప్లాట్లలో చేరుతోంది. దీంతో ఆ ప్లాట్లు దుర్గంధాన్ని వెదజల్లుతుండడమే కాకుండా దోమలకు ఆవాసంగా మారుతున్నాయి.



- పిచ్చి మొక్కలు, పాచి పట్టిన నీటితో ఉన్న ఈ ప్లాటు మెట్‌పల్లిలోని బాలకృష్ణనగర్‌లోనిది. ఇటీవల కురిసిన వర్షాలతో ఆ ప్లాట్‌లోకి వరద నీరు వచ్చి చేరింది.
- మెట్‌పల్లిలో 26వార్డులు ఉన్నాయి. శివారు కాలనీల్లో జనావాసాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లతో మురుగు నీరు చేరి కుంటలుగా, దోమలకు నిలయంగా మారుతున్నాయి. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల నివారణ కోసం తరుచుగా ఫాగింగ్ చేస్తున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుందని అంటున్నారు.

'స్పౌజ్' దుర్వినియోగంపై విద్యాశాఖ ఫైర్!

- టీచర్ల అక్రమ బదిలీల ఫిర్యాదులపై ఆరా
- ఆప్షన్లు పరిశీలించాలని డీఈవోలకు ఆదేశాలు
- చర్యలు తీసుకోవాలన్న విద్యాశాఖ కమిషనర్ దేవసేన
- టీచర్ల బదిలీల్లో అక్రమాలను వెలికితీసిన 'సాక్షి' దినపత్రిక



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే గవర్నమెంట్ హెడ్‌మాస్టర్ (జీహెచ్‌ఎం) బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై విద్యాశాఖ స్పందించింది. దంపతులిద్దరూ ప్రభుత్వ టీచర్లు అయి బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో భార్యాభర్తలు ఒకే దగ్గర పనిచేసేందుకు వారికి ప్రత్యేకంగా 10 పాయింట్లు కేటాయించింది. ఈ పాయింట్లు ప్రత్యేకంగా వినియోగించుకుని స్పౌజ్ టీచర్లంతా ఒకే చోట పనిచేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. కానీ... ప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడుస్తూ చాలా మంది జీహెచ్‌ఎంలు వారి భార్య/భర్త వద్దకు కాకుండా తమకు నచ్చిన చోటుకు బదిలీ కోసం ఈ పాయింట్లను వాడుతున్నారు. ఈ విషయాన్ని ఈనెల 20వ తేదీన 'సార్లూ.. ఇది తగునా' శీర్షికన పలువురు జీహెచ్‌ఎంలు నిబంధనలకు విరుద్ధంగా చేసుకున్న దరఖాస్తుల తీరును 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై నాన్‌స్పౌజ్ టీచర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు సాక్షి కథనం రేపిన దుమారంపై జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లోని జిల్లా విద్యాశాఖ అధికారులు(డీఈవోలు) అప్రమత్తమయ్యారు. జీహెచ్‌ఎంలు నిబంధనలకు విరుద్ధంగా చేసుకున్న ఆప్షన్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన దృష్టికి తీసుకెళ్లారు.

చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

కేంద్ర, రాష్ట్ర, లోకల్‌బాడీల్లోని భార్యభర్తలైన టీచర్లు ఒకే చోట పనిచేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పది పాయింట్ల విధానాన్ని తీసుకొచ్చింది. అయితే పలు చోట్ల అక్రమాలు జరుగుతున్నాయన్న 'సాక్షి' కథనంపై స్పందించిన దేవసేన రాష్ట్రంలోని అన్ని డీఈవో కార్యాలయాలను అప్రమత్తం చేశారు. ఇప్పటి వరకు చేసుకున్న జీహెచ్‌ఎం దరఖాస్తుల్లోని ఆప్షన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. వారిలో భార్య లేదా భర్త పనిచేస్తున్న చోటుకు కాకుండా దూరంగా దరఖాస్తు చేసుకున్నా.. పాయింట్లను దుర్వినియోగం చేసిన వారిని గుర్తించి వెంటనే వారికి కేటాయించిన 10 పాయింట్లు రద్దు చేయాలని, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఎందుకు దుర్వినియోగం?

- కేవలం జిల్లా కేంద్రాల్లో నివసించాలని, తమ పిల్లలకు మంచి విద్య, వైద్యం అందాలన్న ఆలోచనలతో చాలా మంది స్పౌజ్ టీచర్లు భార్య/భర్తకు దూరంగా ఉన్న పాఠశాలను ఆప్షన్‌గా ఎంచుకుంటున్నారు.
- స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగానికి అధిక హెచ్‌ఆర్‌ఏ మరో కారణమని నాన్‌స్పౌజ్ టీచర్లు ఆరోపిస్తున్నారు. అర్బన్, సెమీఅర్బన్, రూరల్ ప్రాంతాల్లో వచ్చే హెచ్‌ఆర్‌ఏ విషయంలో వ్యత్యాసాల కారణంగా స్పౌజ్ టీచర్లంతా తప్పుదారి పడుతున్నారని మండిపడుతున్నారు.
- కాంప్లెక్స్ పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సి రావడం ఇబ్బందిగా భావిస్తున్నారు. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు బిల్స్ నిర్వహణ, వేతనాలు చెల్లింపు, సెలవుల పట్టీ, సర్వీసు పుస్తకాల రికార్డుల నిర్వహణ తదితర కారణాలతో పని ఎగ్గొట్టేందుకు వీరు కాంప్లెక్స్ పాఠశాలలను ఎంచుకోకుండా మరో చోటుకు వెళ్తున్నారు.
- భార్య/భర్త జీహెచ్‌ఎంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసేందుకు స్పౌజ్‌లు ఇబ్బంది పడుతున్నారు. తమ భర్త/భార్య ఆదేశాలు పాటించడం ఇష్టం లేని వారు అవే పాయింట్లు వినియోగించుకుని స్పౌజ్‌కు దూరంగా వెళ్తున్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం

- జగిత్యాల మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల నలుమూలలు పచ్చదనం వెల్లివిరిసేలా మొక్కలు నాటడం జరిగిందని, పట్టణాభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని, గతంలో కన్నా వందరెట్లు పట్టణం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ, జగిత్యాలలో అమరవీరుల స్తూపం, హౌసింగ్ బోర్డు పార్క్, తారకరామనగర్, ప్రకృతి వనం ప్రజలు సేద తీర్చుకోవడానికి పార్క్‌లు ఇలా ఎన్నో అభివృద్ధి చేసుకోవడంతో పాటు, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, మాత శిశు ఆస్పత్రి, డయాలసిస్, సెంట్రల్ లైటింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో లేని విధంగా యావర్‌రోడ్ వైండింగ్‌లో స్థలం కోల్పోతున్న వారికి నష్టపరిహారం కింద టీడీఆర్ పథకం తీసుకురావడం జరిగిందని అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో సిబ్బంది కృషి చేయాలన్నారు. నూకపల్లి అర్బన్ కాలనీ కోసం డబుల్‌బెడ్‌రూంల కోసం ఎలక్ట్రికల్, పెంయింటింగ్ పనులు చేసేందుకు రూ.39 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. మున్సిపల్‌లో ఉన్న పలు సమస్యలను కౌన్సిలర్లు దృష్టికి తీసుకెళ్లగా సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం 17 ఎజెండా అంశాలను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదించింది. కమిషనర్ అనిల్‌బాబు, డీఈ రాజేశ్వర్, టీపీవో శ్రీనివాస్, శరణ్‌తేజ, అనిల్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

'బల్దియాలో అవినీతి ఆగేదెప్పుడు?'

జగిత్యాలటౌన్: జగిత్యాల బల్దియాలో అవినీతి ఆగేదెప్పుడని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాల పేరిట జగిత్యాల ప్రజల పన్నుల నుంచి కేటాయించిన రూ.24లక్షల ఖర్చుల వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రూ.44లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ ఏనాడు నడిచింది లేదని విమర్శించారు. సానిటేషన్ వాహనాలు నడవకున్నా డీజిల్ బిల్లులు పెడుతూ ప్రజాధనాన్ని కొందరు తమ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. సానిటేషన్ సిబ్బంది కేవలం ప్రధాన వీధులనే శుభ్రం చేస్తూ మిగతా ప్రాంతాలను పట్టించుకోవడం లేదని అన్నారు. సిటీలో డెంగీ కేసులు పెరిగి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారని అన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మద్దతు తెలుపుతున్న నాయకులు

జగిత్యాల: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, తెలంగాణ స్టేట్ గౌట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు అన్నారు. సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగరాజం, యూనిట్ 1,2 అధ్యక్షుడు రవీందర్, అంజయ్య, గంగాధర్, మిసాక్ అహ్మద్, కమలాకర్ రెడ్డి, అశోక్, ఆనందం, కాంతయ్య, రాజేశ్వర్ రావు, ఓంకార్ పాల్గొన్నారు.

పేదలకు వెసులుబాటు ఇవ్వాలి: జీవన్‌రెడ్డి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్: ఇందిరమ్మ పథకం కింద నిర్మించుకున్న ఇంటిస్థలాల్ని క్రమబద్ధీకరించాలంటే పేదలకు రూ.లక్ష చెల్లించడం సాధ్యం కాదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సారంగాపూర్ తహసీల్దార్ తాఫాజుల్లా హుస్సేన్‌కు విన్నవించారు. సారంగాపూర్, గణేశ్‌పల్లి ఒడ్డెరులు ఇళ్లు నిర్మించుకున్న స్థలాలను జీవో నంబరు 59కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా, రెవెన్యూ అధికారులు రూ.లక్ష చెల్లించాలని ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఒడ్డెరులతో కలిసి సారంగాపూర్ తహసీల్దార్‌ను కలిశారు. పేద కుటుంబాలకు ఫీజు చెల్లింపులో వెసులుబాటు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. చాలామంది 30ఏళ్లక్రితం భూములు కొనుగోలు చేసి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్నారని అన్నారు. ఇటీవల ఒడ్డెరులు అవగాహన లేక గృహలక్ష్మి పథకం కింద ఇళ్లకోసం ఈ దరఖాస్తులు సమర్పిస్తే, ఇప్పుడు క్రమబద్ధీకరణకు రూ.లక్ష చెల్లించాలని నోటీసులు రావడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారులకు నివేదించి, న్యాయం చేస్తామని తహసీల్దార్ అన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్‌కు విశేష స్పందన



నవయుగ యూత్ గణేశ్‌తో జోగ కల్యాణ్



విఘ్నేశ్వర ఫ్రెండ్స్ యూత్



నాగునూర్ తుంగతుర్తి సతీశ్‌రావు



మట్టి గణపతితో వాసం దిలీప్ కుటుంబం

జగిత్యాలటౌన్: 'సాక్షి' సెల్ఫీ విత్ గణేశ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. నవయుగ యూత్ గణనాథుడితో యూత్ సభ్యుడు జోగ కల్యాణ్, వాసం దిలీప్, తుంగతుర్తి సతీశ్‌రావు, విఘ్నేశ్వర ఫ్రెండ్స్ యూత్ సభ్యులు సెల్ఫీ పంపారు. మీరూ మట్టిగణపతితో సెల్ఫీదిగి 95426 16103 నంబరుకు వాట్సప్ చేయండి.

ఎప్పుడు పూర్తి చేస్తారో..?

- నత్తనడకన హైలెవల్ వంతెన పనులు
- ఇబ్బందిపడుతున్న రెండు మండలాల ప్రజలు
- గత ఫిబ్రవరిలో పనులు ప్రారంభం.. ఇప్పటికీ పూర్తికాని వైనం
- ఈ వర్షాకాలంలో మూడుసార్లు కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- తరచూ నిలిచిపోతున్న రాకపోకలు



మధ్యలోనే నిలిచిపోయిన వంతెన పనులు, పక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ వాగుపై హైలెవల్ వంతెన పనులు నత్తనడకన సాగడంతో సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతో పాటు మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తదితర గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వర్షాకాలంలో వంతెన మీదుగా రోజుల తరబడి జగిత్యాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇతర దారుల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి గ్రామాలకు చేరుకోవడానికి ప్రజలు ఆర్థికంగా, విలువైన సమయాన్ని నష్టపోతున్నారు.

రూ.5.65 కోట్ల వ్యయంతో..

జగిత్యాలకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనాపూర్ వాగు ఎప్పుడూ ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాకాలంలో పరిస్థితి మరి దారుణంగా ఉంటోంది. భారీ వర్షాలకు ఎగువన ఉన్న చెరువులు, కుంటలు, గుట్టల ద్వారా వచ్చే వరదనీరు ఈ వాగు గుండా వెళ్తోంది. గతంలో ఇక్కడ లో లెవల్ కాజ్‌వే ఏర్పాటు చేయగా, భారీ వర్షాలు, వరదలు వస్తే రాకపోకలు నిలిపివేసేవారు. 1980లో కట్టిన కాజ్‌వే కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరి ఒక పక్కన కుంగిపోయింది. దీంతో వరదలు లేని సమయంలోనూ కాజ్‌వే పై నుంచి వాహనదారులు భయభయంగా వెళ్లేవారు. ఆర్‌అండ్‌బీ శాఖ శిథిలమైన కాజ్‌వేను తొలగించి రూ.5.65 కోట్ల వ్యయంతో హైలెవల్ వంతెన నిర్మించేందుకు సంకల్పించి, టెండర్లు పూర్తి చేసి ఫిబ్రవరిలో పనులు ప్రారంభించింది.

పనుల్లో జాప్యం..

గత ఫిబ్రవరి 24న వంతెన పనులు ప్రారంభించిన అధికారులు జూన్ చివరి వరకు పూర్తి చేయాలని భావించారు. పనులు జరుగుతున్న సమయంలో వాహనదారులు ఇబ్బందిపడకుండా వాగులో పైప్‌లు వేసి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. కాగా ఈ వర్షాకాలంలో భారీ వరదలకు అప్రోచ్ రోడ్డు మూడుసార్లు కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన ప్రతిసారి అధికారులు కొత్తగా నిర్మిస్తూ వచ్చారు. అయినా సదరు రోడ్డు కోతకు గురికావడంతో భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఈక్రమంలో వాహనదారులు జగిత్యాల రూరల్ మండలం అనంతారం, సారంగాపూర్ మండలం లచ్చక్కపేట మీదుగా జగిత్యాలకు వెళ్లాల్సి వచ్చేది. భారీ వర్షాలకు ఈ రెండు రోడ్లు కూడా తెగిపోవడంతో రోజుల తరబడి జగిత్యాల– సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెండు మండలాల ప్రజల ఇతర ప్రాంతాల గుండా జగిత్యాలకు వెళ్తుండడంతో దూరభారం అవుతోందని వాపోతున్నారు.

సమస్య పరిష్కరించాలి



అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో నెల రోజులుగా ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. మేము జగిత్యాల వెళ్లాలంటే లక్ష్మీదేవిపల్లి వచ్చి బస్సులు ఎక్కాల్సి వస్తుంది. వంతెన నిర్మాణం వెంటనే పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలి.

– ఆరె మనోహర్, పెంబట్ల

ధర్మపురి మీదుగా వెళ్తున్నం



బీర్‌పూర్ నుంచి సారంగాపూర్ మండలం మీదుగా జగిత్యాలకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు అప్రోచ్‌రోడ్డు కోతకు గురికావడంతో చాలా మంది వాహనదారులు ధర్మపురి మీదుగా జగిత్యాలకు వెళ్లాల్సివస్తుంది.

– భైరవేని సత్యనారాయణ, బీర్‌పూర్

పదిరోజుల్లో ప్రారంభిస్తాం



వర్షాలు, వరదల కారణంగా పనులకు తీవ్ర అంతరాయం కలిగింది. వినాయక నిమజ్జనం తర్వాత పనులు ప్రారంభించి, డిసెంబర్ చివరినాటికి హై లెవల్ వంతెన పూర్తి చేస్తాం. ప్రజలు సహకరించాలి.

– రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ

'ఆసరా' నిరుపేదలకు భరోసా

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



పింఛన్ గుర్తింపుకార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: నిరుపేదలకు ఆసరా పెన్షన్ భరోసాగా ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం వెంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో ఇబ్రహీంపట్నం, అమ్మక్కపేట, కోజన్‌కొత్తూర్, కేశాపూర్, వర్షకొండ వెంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో వర్షకొండ, కొమటికొండాపూర్, డబ్బా, ఎర్దండి గ్రామాలకు చెందిన పెన్షన్‌దారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి పెన్షన్ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండలంలో 9,860 మందికి ప్రతి నెల పెన్షన్ వస్తున్నట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం తనకు రాజకీయ భిక్ష పెట్టిందని, ఇక్కడినుంచే మొదటగా జెడ్పీటీసీగా గెలిపించి, తరువాత నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించారని గుర్తుచేశారు. వయసు మీద పడుతున్నందున ప్రజలకు సేవ చేసేందుకు తన కొడుకు డాక్టర్ సంజయ్ ముందుకు వస్తున్నాడని, వచ్చే ఎన్నికలలో కోరుట్ల ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ ప్రసాద్, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ ఏలేటి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయసమ్మేళన సభలో బాలుడికి పిట్స్

ఆత్మీయసమ్మేళనంలో మండలంలోని అమ్మక్కపేట గ్రామానికి చెందిన లవంగ రాజశేఖర్, లావణ్య దంపతుల కొడుకు హితేంద్రకు పిట్స్ వచ్చింది. అక్కడే ఉన్న డాక్టర్ సంజయ్ వెంటనే ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి పంపించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామానికి చెందిన సుమారు 50మందికి పైగా యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మెట్‌పల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఓ కంపెనీ పేరుతో మోసం.. కేసు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచన

జగిత్యాల క్రైం: ఓ కంపెనీ పేరుతో ప్రచారం చేస్తూ, ప్రజల ఆరోగ్య అవసరాలను సొమ్ము చేసుకోవాలను ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని, ప్రజలు ఇటువంటి మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎగ్గిడి భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకులం జిల్లా ఆముదాలవలస, నవనంబాదుకు చెందిన దుంగా హరికృష్ణ ప్రసాద్, రాయికల్ మండలానికి చెందిన సదుల సంతోష్ కలిసి జగిత్యాలలో బిగిటప్ అనే కంపెనీ పేరుతో హోర్డింగులు ఏర్పాటు చేశారు. రోజుకు రూ.21చెల్లించి హెల్త్ కార్డు తీసుకోవాలని, దీని ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్, మందులు, స్కానింగ్, ల్యాబ్ టెస్టులు జగిత్యాలలోని అన్ని ప్రముఖ ఆస్పత్రుల్లో చేయించుకోవచ్చని పేర్కొన్నారు. మొదటి ఆరు నెలల వరకు 50శాతం రాయితీ, తరువాత 6నెలలు పూర్తిగా ఉచితం అని ప్రచారంలో పేర్కొన్నారు. దీనిపై జగిత్యాల మెడికల్ అసోసియేషన్ డాక్టర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హరికృష్ణ ప్రసాద్, సదుల సంతోష్‌పై కేసు నమోదు చేశారు. ఈ కంపెనీ ఏ ఆస్పత్రితో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని ఇది పూర్తిగా మోసపూరిత ప్రకటన అని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

సూపర్-12 మిత్రుల ఔదార్యం

రాయికల్: మండలంలోని కిష్టంపేటకు చెందిన దివ్యాంగుడు మంగళారపు గంగారెడ్డి నడవలేని స్థితిలో ఉండటంతో జగిత్యాల పట్టణంలోని సూపర్12 మిత్రులంతా కలిసి రూ.80 వేల వ్యయంతో త్రిచక్ర వాహనాన్ని శుక్రవారం అందజేశారు. సభ్యులు తంగెళ్ల రమేశ్, డాక్టర్ తాటిపాముల సురేశ్, మోర సుమన్, ఒడ్నాల రాజశేఖర్, కన్నవేని మల్లారెడ్డి, గంగారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మచ్చ శంకర్, భైరం హరికిరణ్, బోగ రవిప్రసాద్, అత్తినేని శ్రీనివాస్, కడపటి రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

జగిత్యాల: మున్సిపల్ ప్రవేశపెట్టిన ఎజెండా అంశాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని 35వ వార్డు కౌన్సిలర్లు జయశ్రీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హరితహారం కో–ఆర్డినేటర్ ఎలాంటి ఉన్నతస్థాయి అధికారి పర్యవేక్షణ లేకుండా కేవలం అతను ఇచ్చిన రికార్డులతో రూ.72,384 జీతం చెల్లించారని, విచారణ చేపట్టాలన్నారు. క్రీడా ప్రాంగణాల పేరిట లక్షలాది రూపాయల సొమ్ము దుర్వినియోగం చేశారన్నారు. ఖిలాలో స్వచ్ఛతహి సేవ నిర్వహించిన కార్యక్రమంలో విచారణ జరపాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో జరిగే ఆత్మ నిర్భర్ నిధి పథకంలో రికార్డులు ఎవిడెన్స్ పొందుపర్చడం లేదని చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటిపన్ను వసూళ్లపై దృష్టిసారించాలి

కథలాపూర్: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్ను వసూళ్లపై దృష్టిసారించాలని కోరుట్ల డీఎల్పీవో శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటిపన్ను వసూలు చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై క్షేత్ర సందర్శన



చిరుధాన్యాలను గురించి రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం చిరుధాన్యాలపై రైతులకు క్షేత్రసందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధనస్థానంలో నూతనంగా కొద్ది విస్తీర్ణంలో సాగు చేసిన చిరుధాన్యాలైన.. జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జలు, చామలు, అరికెలు, ఊదల పంటల గురించి శాస్త్రవేత్తలు డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ స్వాతి, డాక్టర్ బలరాం, డాక్టర్ గోన్యానాయక్, డాక్టర్ పి.రవి వివరించారు.

'కర్షకమిత్ర' ద్వారా రూ.10 లక్షల రుణం

- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- సిరికొండలో గోదాం, సీఎస్‌సీ ప్రారంభం



సిరికొండలో గోదాం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

కథలాపూర్(వేములవాడ): 'కర్షకమిత్ర' పథకం కింద సహకార సంఘాల ద్వారా ఒక్కోరైతుకు రూ.10 లక్షలు రుణం ఇచ్చేలా ప్రణాళిక రూపొందించామని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నిర్మించిన గోదాం, కామన్ సర్వీస్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సహకార సంఘాల ద్వారా పంట రుణాలు ఇస్తున్నప్పటికి పెట్టుబడికే సరిపోతున్నాయని, భూమి చదును, ఇతర అవసరాలు తీర్చడానికి 'కర్షకమిత్ర' పథకంలో రూ.10 లక్షలు రుణాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో 138సహకార సంఘాలకు గాను 100 సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు ప్రారంభించామని పేర్కొన్నారు. 2014కు ముందు సహకార సంఘాల ద్వారా రైతులకు రూ.1,300 కోట్లు రుణాలు ఇచ్చామని, రాష్ట్రం ఏర్పడ్డాక ప్రస్తుతం రూ.6వేల కోట్ల రుణాలు ఇచ్చామని, రూ.2,500 కోట్ల డిపాజిట్లు సేకరించామని తెలిపారు. కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, డీసీవో సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ చుక్క దేవరాజం, మాజీ చైర్మన్ కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, సీఈవో రాము, డైరెక్టర్లు కందరి కిషన్‌రెడ్డి, ఏనుగు గంగారెడ్డి, పొట్కురి మోహన్ రెడ్డి, లోకిని గంగనర్సయ్య, ఎండీ. మక్దుంపాషా, గట్ల మహేశ్, అల్లె రాందాస్ పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించాలి



ధర్నా చేస్తున్న చెరుకు రైతులు, కాంగ్రెస్ నాయకులు

- హామీని మరిచిన ఎంపీ, ఎమ్మెల్యేకు గుణపాఠం తప్పదు
- పీసీసీ డెలిగేట్ సభ్యుడు జువ్వాడి నర్సింగరావు
- ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా

మల్లాపూర్/కోరుట్లరూరల్: ఉమ్మడి జిల్లాలోని ఏకైక వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా గుర్తింపు పొందిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని చెరుకు రైతుల ప్రయోజనార్థం వెంటనే తెరిపించాలని పీసీసీ డెలిగేట్ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. షుగర్ ఫ్యాక్టరీ మూసివేసి ఎనిమి దేళ్ల పూర్తయిన సందర్భంగా కోరుట్ల మండలం అ యిలాపూర్ నుంచి మల్లాపూర్ మండలం ముత్యంపేట నిజాం చక్కెర ఫ్యాక్టరీ వరకు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఫ్యాక్టరీ వద్ద చెరుకు రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడీ కృష్ణారావుతో కలిసి ధర్నా చేపట్టారు. నర్సింగారావు మాట్లాడుతూ.. గత ఎనిమిది సీజన్లుగా రైతులు పండించి చెరుకును కామారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీకి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారంలోకి వస్తే 100రోజుల్లోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకుంటామన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎంపీగా గెలిస్తే చెరుకు రైతుల కోసం సొంత డబ్బు వెచ్చించి ఫ్యాక్టరీని నడుపుతానన్న బీజేపీ ఎంపీ అరవింద్ వారి వాగ్దానాలు విస్మరించడం దారుణం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మలు దహనం చేశారు. సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పెరుమాండ్ల సత్యనారాయణ, అందె మారుతి, చింతలపెల్లి రాజేశ్వర్‌రెడ్డి, కడకుంట్ల సాయికుమార్ పాల్గొన్నారు.

వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయం చేయాలి

- పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్

జగిత్యాలఅగ్రికల్చర్: వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం చేస్తేనే రైతులకు మనుగడ సాధ్యమని వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం అగ్ని ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో అగ్రిమాప్, అగ్రిటెక్ మార్కెట్ యాక్సిస్‌పై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వ్యవసాయంలో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. చాలా చోట్ల రైతులే స్వయంగా పరికరాలు రూపొందించుకుని, కష్టాన్ని తగ్గించుకుంటున్నారని చెప్పారు. వాతావరణం ఎప్పుడు, ఎలా ఉంటుందో చెప్పే పరిస్థితులు లేనందున, అందుకు అనుకూలంగానే మనం మారాల్సిన అవసరం ఉందన్నారు. అగ్రి ఇన్నోవేషన్ హబ్ సీఈవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులంతా ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు అగ్రి హబ్ అనుసంధానంగా ఉంటూ కార్పొరేట్ కంపెనీలతో మార్కెట్ అనుసంధానం చేయడం జరుగుతుందని అన్నారు. పలు అంకుర పరిశ్రమల సీఈవోలు అభిషేక్‌గుప్తా, సుశాంత్, నర్సింహారెడ్డి, కార్తీక్‌రావు, నవీన్ వారి పరిశ్రమల తీరు తెన్నుల గురించి వివరించారు. అడిషనల్ డీఆర్‌డీవో సుధీర్, డీపీఎం వెంకటేశ్, అగ్రి హబ్ బీడీఎం ముఖేశ్, రంజిత్, పొలాస పరిశోధన స్థానం అగ్రిహబ్ ఇన్‌చార్జి రజినిదేవి పాల్గొన్నారు.

నలిమెల, విమలక్కకు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం



పురస్కారాలు అందుకుంటున్న భాస్కర్, విమలక్క

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిలింభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్, అరుణోదయ కళాకారిణి విమలక్కకు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ నలిమెల భాస్కర్ నలభై ఏళ్లుగా తెలంగాణ భాష సేద్యం చేస్తున్నారని, ఆయనకు ఈ పురస్కారం రావడం మనందరికి దక్కినట్లే నన్నారు. నల్లరేగడి నేలలో ఎర్రని పాటలు పాడి.. ప్రజల మెదళ్లలో కొత్త ఆలోచనలను మొలకెత్తించే గొప్ప కార్యాన్ని చేపట్టిన విమలక్కకు ఈ అవార్డు దక్కడం గొప్ప విషయమని కొనియాడారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ట్రస్ట్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవిచంద్ర, ఉపాధ్యక్షుడు అశోక్, కవులు అన్నవరం దేవేందర్, పీఎస్ రవీంద్ర, మాడిశెట్టి గోపాల్, నంది శ్రీనివాస్, పొన్నం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దేశభక్తుల వీరగాథ 3.0 పోటీలకు ఆహ్వానం



వీరగాథ ప్రాజెక్ట్ 3.0

జగిత్యాల: కేంద్రరక్షణ, విద్యామంత్రిత్వశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల విద్యార్థులకు వీరగాథ 3.0 పేరిట ప్రత్యేక పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. 1-5, 6-8, 9-10, 11-12 తరగతులకు విభాగాల వారిగా పద్య, కథల చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీరుల త్యాగాల పోరాటాలు, జీవనకథ దేశరక్షణ ఇలా పలు అంశాలపై తమ ప్రతిభను నిరూపించుకోవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31లోపు innovateindia. mygov. in/ veergatha3 వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలిచిన 100 మందికి ఒక విద్యార్థికి రూ.10 వేల చొప్పున బహుమతి అందించనున్నట్లు తెలిపారు. మిగతా వివరాలకు జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్ 94401 94120 సంప్రదించాలని కోరారు.